7లో



రాళ్లకత్వ వద్ద ప్రమాదానికిగురైన ఆర్టీసీ బస్సు

చెట్టును ఢీకొన్న బస్సు

- 30 మంది ప్రయాణికులకు గాయాలు

జిన్నారం, ఫిబ్రవరి 7: ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ వద్ద రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 30 మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బస్సులో నుంచి ప్రయాణికులను కిందికి దించి అంబులెన్సులు, ప్రైవేటు వాహనాల్లో పటాన్‌చెరులోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే కారణమని ప్రయాణికులు, స్థానికులు ఆరోపించారు. చెట్టు లేకుంటే బస్సు పక్కనే ఉన్న గుంతలో పడి పెను ప్రమాదం జరిగేదని వారు తెలిపారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ పరామర్శించారు. ఘటనపై బస్సులో ప్రయాణికురాలు పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జిన్నారం ఎస్‌ఐ విజయ్‌రావు తెలిపారు. డీఎస్పీ పురుషోత్తంరెడ్డి ప్రయాణికుల నుంచి వివరాలు సేకరించారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న నాయకులు

గృహజ్యోతి వెలుగులు 9,74,857 ఇళ్లకు..





ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులు 9,74,857 మంది ఉన్నారు. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 5,11,000 కనెక్షన్లు, సిద్దిపేట జిల్లాలో 2,92,193 కనెక్షన్లు, మెదక్ జిల్లాలో 1,71,664 కనెక్షన్లు గృహజ్యోతి పథకానికి అర్హత సాధించనున్నాయి

- కసరత్తు ప్రారంభించిన విద్యుత్‌శాఖ
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు
- ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్ నమోదు
- ప్రక్రియను పరిశీలించిన ఉన్నతాధికారులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా 'గృహజ్యోతి' పథకం అమలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల నుంచే ఈ పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించేవారికి ఈ పథకం ద్వారా ఉచిత విద్యుత్ అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారి సమాచారాన్ని విద్యుత్‌శాఖకు అప్పగించడంతో అర్హులను గుర్తించే పనిలో ఉన్నారు. దీంతో విద్యుత్ సిబ్బంది ప్రతీ ఇంటిని సందర్శించి దరఖాస్తుదారుల కరెంట్ కనెక్షన్ నంబర్, ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సేకరించిన డేటాను విద్యుత్ పంపిణీ సంస్థల బిల్లింగ్‌డేటాతో అనుసంధానం చేసి ఈ నెల 15 వరకు అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు.

కిరాయిదారులకూ వర్తింపు

సొంతిల్లు లేక ఇతరుల ఇళ్లలో కిరాయికి ఉండేవారికి కూడా గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయనున్నారు. మీటర్ ఇంటి యజమాని పేరిట ఉన్నప్పటికీ కిరాయిదారుల వివరాలను అనుసంధానం చేస్తున్నారు. కిరాయిదారులు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోకపోయినా ఇంటికి విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు పేరు, విద్యుత్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఆధార్, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేయించుకుంటే సదరు ఇంటి కనెక్షన్‌తో వారి వివరాలను అనుసంధానించనున్నారు. ఇంటి యజమాని అభ్యంతరం తెలిపితే మాత్రం నమోదు చేయవద్దని అధికారులు సిబ్బందికి సూచిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

టీఎస్‌ఎస్పీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ సీజీఎం, జిల్లా ప్రత్యేకాధికారి రంగనాథ్‌రాయ్

గజ్వేల్/సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7: గృహజ్యోతి పథకాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఎనర్జీ ఆడిట్ సీజీఎం, జిల్లా ప్రత్యేకాధికారి రంగనాథ్‌రాయ్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట మున్సిపాలిటీల్లోని పలు వార్డుల్లో బిల్లింగ్‌డాటాతో వినియోగదారుల ఆధార్, వివరాల అనుసంధానాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా విద్యుత్ మీటర్‌కు ఆధార్, వివరాల అనుసంధాన కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లావ్యాప్తంగా చురుకుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిల్లింగ్ మిషన్ ద్వారా ఇంటికి వచ్చే బిల్లింగ్ సిబ్బందికి వినియోగదారుల ఇంటికి వచ్చినప్పుడు అన్ని వివరాలను తెలిపి సహకరించాలన్నారు. విద్యుత్ మీటర్ ఇంటి యాజమాని పేరుపై ఉన్నప్పటికీ ప్రస్తుతం ఇంట్లో అద్దెకున్న వారి వివరాలను సర్వీసుకు అనుసంధానం చేస్తున్నామని, దీనివలన అద్దెకు ఉన్న వారికి సైతం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ జిల్లా అధికారి మహేశ్, గజ్వేల్ డీఈ భానుప్రకాశ్, ఏడీఈ జగదీశ్‌ఆర్య, ఏఈ మారుతి, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



గజ్వేల్‌లో బిల్లింగ్ డేటా అనుసంధానం చేస్తున్న సీజీఎం రంగనాథ్‌రాయ్

అర్హులను గుర్తించేందుకే వివరాల నమోదు : విద్యుత్‌శాఖ డైరెక్టర్ నందకుమార్

గృహజ్యోతి పథకంలో భాగంగా ప్రభుత్వ నిబంధనల ఆధారంగా అర్హులను తేల్చేందుకు ఇంటింటా వివరాల నమోదు ప్రకియను ప్రారంభించామని విద్యుత్‌శాఖ డైరెక్టర్ నందకుమార్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలో వినియోగదారుల వివరాల నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. అద్దెకున్న వారి వివరాలను సర్వీసుకు అనుసంధానం చేస్తున్నామన్నారు. యజమాని అనుమతితో కిరాయిదారుల వివరాలను కూడా నమోదు చేస్తారని తెలిపారు. ఈ నెల 15 వరకు ఈ ప్రక్రియను పూర్తిచేస్తామని వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఈ జానకిరామ్, డీఈ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

ఇదో.. ఛీట్‌ఫండ్

- చీటీ డబ్బులు చెల్లించరు.. డిపాజిట్లు తిరిగి ఇవ్వరు..!
- మూడు నెలల క్రితం మెదక్ బ్రాంచి మూత
- రూ. మూడు కోట్లకు కుచ్చుటోపీ
- డబ్బులకు బదులు ప్లాట్లు తీసుకోవాలని ఒత్తిడి



మెదక్‌లో మూతబడ్డ కనకదుర్గ చిట్‌ఫండ్ బ్రాంచి

మెదక్, ఫిబ్రవరి 7 : కడుపు కట్టుకుని పైసా పైసా పోగేసుకున్న అమాయకుల డబ్బును కాజేసి బోర్డు తిప్పేసిందో చిట్‌ఫండ్ కంపెనీ. కనకదుర్గ చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ తొమ్మిది సంవత్సరాల క్రితం రాష్ట్రవ్యాప్తంగా కార్యకలాపాలను ప్రారంభించింది. రెండేళ్ల తర్వాత మెదక్ పట్టణంలో బ్రాంచిని ప్రారంభించారు. రూ. లక్ష నుంచి రూ. 30 లక్షల వరకు చిట్టీలను నడిపారు. మెదక్ బ్రాంచి పరిధిలో 500 మంది సభ్యులతో రూ. మూడు కోట్ల టర్నోవర్ సాధించింది. ఇదే ఊపులో చిట్‌ఫండ్ యాజమాన్యం పలు వ్యాపారాలను ప్రారంభించింది. అయితే, మూడు నెలల క్రితం ఇక్కడి బ్రాంచిని మూసివేసి.. సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేసింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి ఎంట్రీ

రాష్ట్ర వ్యాప్తంగా రియల్‌బూమ్ కొనసాగుతున్న తరుణంలో యాజమాన్యం ప్లాట్ల విక్రయాలకు తెరలేపింది. చిట్‌ఫండ్ డబ్బును స్థలాల కొనుగోలు కోసం వాడుకుంది. మెదక్ జిల్లా మనోహరాబాద్, రామాయంపేట, వరంగల్ జిల్లా, జనగామ జిల్లాల్లోనూ భూములు కొనుగోలు చేసినట్లు చెబుతోంది. ఇందు కోసం చీటీ పాడుకున్న సభ్యుడికి నెలలోగా డబ్బు చెల్లించాల్సి ఉన్నా సిబ్బంది ఏవో లిటిగేషన్లు పెట్టి ఆలస్యం చేసేవారు. డబ్బుకు బదులు ప్లాట్లు తీసుకోవాలని చిట్‌ఫండ్ సిబ్బంది బలవంత పెట్టేవారని పలువురు సభ్యులు తెలిపారు.

టౌన్‌షిప్ పేరిట మోసం

డిపాజిట్ల సేకరణ కోసం కనకదుర్గ టౌన్‌షిప్ పేరిట ఫేక్ సంస్థను సృష్టించారు. సంవత్సరానికి 24 శాతం వడ్డీ చెల్లిస్తామని ప్రకటించడంతో చిరుద్యోగులు, పెన్షనర్లు, వ్యాపారులు, గృహిణులు దాచుకున్న సొమ్మును సంస్థ వద్ద డిపాజిట్ చేశారు. మెదక్ బ్రాంచి పరిధిలోనే రూ.8 కోట్ల వరకూ సేకరించినట్లు ఓ ఏజెంట్ తెలిపారు. డిపాజిట్‌దారులకు డెబిట్‌నోట్ పేరిట రెవెన్యూస్టాంపు కూడా లేని బాండ్లు ఇచ్చారు. మొదట్లో ప్రతీ నెలా క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించేవారు. సంవత్సర నుంచి డిపాజిట్ దారులకు వడ్డీ చెల్లించడం లేదు. డిపాజిట్ తిరిగి ఇవ్వాలని కోరితే అసలు కూడా చెల్లించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. డిపాజిటర్ల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో మూడు నెలల క్రితం మెదక్ బ్రాంచిని మూసివేశారని చిట్‌ఫండ్ సీనియర్ ఏజెంట్ కృష్ణారెడ్డి తెలిపారు. దీంతో హన్మకొండలో ఉన్న ప్రధాన కార్యాలయానికి బాధితులు క్యూ కడుతున్నారు.

కోర్టు ఆదేశాలతోనే చర్యలు : చిట్‌ఫండ్ రిజిస్ట్రార్

కనకదుర్గ చిట్‌ఫండ్‌లో చీటీలు కట్టి మోసపోయినట్టు పలువురు బాధితులు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్టు చిట్‌ఫండ్ రిజిస్ట్రార్ తెలిపారు. చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

న్యాయం కోసం కోర్టుకు వెళ్తాం



కనకదుర్గ యాజమాన్యం చీటీ సభ్యులకు డబ్బులు చెల్లించడం లేదు. బదులుగా ప్లాట్లు రిజిస్టర్ చేసిస్తామని ఎండీ దబాయిస్తున్నారు. చవకబారు భూములు తీసుకోవడానికి సభ్యులు సిద్ధంగా లేరు. అవసరానికి కూడబెట్టుకున్న డబ్బులను అందించకుండా ఆందోళనకు గురి చేస్తున్నారు. న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తాం.

-కృష్ణారెడ్డి, కనకదుర్గ చిట్‌ఫండ్ ఏజెంట్



పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులు

అర్ధాకలి చదువులు..

దాతల కోసం ఎదురుచూపులు

'పది' విద్యార్థులకు స్నాక్స్ ఇచ్చేందుకు నిధులు కరువు

నెలన్నరగా అందని అల్పాహారం.. సంగారెడ్డి జిల్లాలో 11,008 మంది విద్యార్థులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు అర్ధాకలితోనే చదువుకోవాల్సి వస్తున్నది. ఉదయం హడావుడిగా స్పెషల్ క్లాసులకు హాజరవుతుండగా తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రవుతున్నది. మధ్యాహ్న భోజనం తప్ప ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం స్నాక్స్ తెచుకోవడానికి సమయం లేకపోవడంతో ఆకలితో నకనకలాడుతున్నారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు నిధుల కోసం ప్రతీ సంవత్సరం అడుక్కోవాల్సి వస్తుండడంతో ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

239 ఉన్నత పాఠశాలలు

మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు గత డిసెంబరు నుంచి స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 239 ఉన్నత పాఠశాలల్లో 11,008 మంది విద్యార్థులు స్పెషల్ క్లాసులకు హాజరవుతున్నారు. ఉదయం పాఠశాల ప్రారంభం కావడానికి ముందు గంట, సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత గంటన్నరకు పైగా స్పెషల్ క్లాసులు జరుగుతున్నాయి. విద్యార్థులు ఉదయం 8.30కు పాఠశాలకు వచ్చి సాయంత్రం 6 గంటలకు తిరిగి వెళ్తున్నారు.

ఖాళీ కడుపులతోనే..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుకుంటారు. స్పెషల్ క్లాసులు హాజరయ్యేందుకు ఇంటి నుంచి త్వరగా బయలుదేరడంతో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కానీ భోజనం కానీ చేయలేకపోతున్నారు. మధ్యాహ్న భోజనం స్కూళ్లలోనే చేస్తున్నా తిరిగి ఇంటికి చేరుకునే సరికి రాత్రవుతుండడంతో అప్పటి వరకు ఆకలితో నకనకలాడుతున్నారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్‌లకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందజేసేవారు. ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున ఖర్చు చేసి బిస్కెట్లు, పండ్లు, మిక్చర్ తదితరాల్లో ఏదో ఒకటి ఇచ్చేవారు. ఇందుకోసం అవసరమైన నిధులను గత సంవత్సరం అప్పటి జిల్లా కలెక్టర్ సమకూర్చారు. ఈసారి మాత్రం దాతలను ఆశ్రయించి నిధులు సమకూర్చుకోవాలని జిల్లా యంత్రాంగం ఎంఈవోలు, హెడ్‌మాస్టర్లకు సూచించింది. దాతలు ముందుకురాకపోవడంతో స్పెషల్ క్లాసులు ప్రారంభమై నెలన్నర గడిచినా విద్యార్థులకు స్నాక్స్ అందించడం లేదు. దీంతో వారంతా ఆకలితోనే పాఠాలు వినాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు విద్యార్థుల ఆకలి తీరే మార్గం ఆలోచిస్తారో.. లేదో..!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ

స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ అగ్రనాయకత్వం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 7: లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలనే విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం అభిప్రాయ సేకరణ చేస్తున్నది. మెదక్, జహీరాబాద్ ఎంపీ టికెట్లు ఆశిస్తున్నవారిపై స్థానిక నాయకుల అభిప్రాయాలను బుధవారం ఆ పార్టీ నాయకులు తెలసుకున్నారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంత కుమార్, కార్యదర్శి మాధవి కంది సమీపంలోని జిల్లా కార్యాలయంలో పార్టీ మండలాల అధ్యక్షులు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల కన్వీనర్లు, కో కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులతో మాట్లాడారు. టిక్కెట్ ఆశిస్తున్న అభ్యర్థుల గురించి వారి అభిప్రాయాలను అడిగి నమోదు చేసుకున్నారు. మెదక్ పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు, ఆకుల రాజయ్య, గురువారెడ్డి, రఘువీరారెడ్డిపై శ్రేణుల అభిప్రాయాలను ఆరా తీశారు. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న ఎల్లారెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, ఎం.జైపాల్‌రెడ్డి గురించి ఆ నియోజకవర్గ నాయకుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. నమోదు చేసుకున్న విషయాలను రాష్ట్ర నాయకత్వానికి నివేదించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.



వరి నాట్లకు నల్గొండ కూలీలు

యాసంగి వరి నాట్లు జోరందుకున్నాయి. జిల్లాలో కూలీల కొరత నెలకొనడంతో రైతులు ఇతర జిల్లాల నుంచి పిలిపిస్తున్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం తాట్‌పల్లి గ్రామం నుంచి వచ్చిన యాభై మంది కూలీలు సంగారెడ్డి చుట్టుపక్కల గ్రామాల్లో నాట్లు వేస్తున్నారు. కంది మండలం చిమ్నాపూర్‌లో బుధవారం వారు నాట్లు వేస్తుండగా 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు రూ. 6వేలు తీసుకుంటున్నామని, ఆరుగురు ఒక్క రోజులో ఎకరా పొలంలో నాట్లు వేస్తామని తెలిపారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

అప్పుడే భానుడి భగభగలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రతలు
- సిద్దిపేట జిల్లా ములుగులో 38.7 డిగ్రీలు, మెదక్ జిల్లా పాపన్నపేటలో 37.5 డిగ్రీలు, సంగారెడ్డిలో 37.1 డిగ్రీలుగా నమోదు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: చలికాలం పూర్తి కాకుండానే భానుడి భగభగలు మొదలయ్యాయి. పగటిపూట సూర్యుడు చురుక్కుమంటున్నాడు. ఫిబ్రవరి చివరి వారంలో పెరగాల్సిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు మొదటి వారంలోనే నమోదవుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం ఈ ఏడాదిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా ములుగులో 38.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కూకునూర్‌పల్లిలో 37.4 డిగ్రీలు, మెదక్ జిల్లా పాపన్నపేటలో 37.5 డిగ్రీలు, కొడిపల్లి, వెల్దుర్తిల్లో 37.2 డిగ్రీలు, సంగారెడ్డిలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



శిఖం భూమిలో తవ్వకాలు జరుపుతున్న వారికి జరిమానా

నారాయణరావుపేట, ఫిబ్రవరి 7: వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని జక్కాపూర్ రెవెన్యూ పరిధిలో అనుమతి లేకుండా ఎక్స్‌కవేటర్‌తో బావి తవ్వుతున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జక్కాపూర్ శివారులోని పూలిశేరు కుంట శిఖం భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్ సహాయంతో బావి తవ్వుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పనులు నిలిపివేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులను విచారణ చేయగా.. ఎలాంటి అనుమతులు లేవని, ప్రభుత్వ భూమిలో బావి తవ్వినందుకు రూ.25 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చేసినా, నిర్మాణాలు చేపట్టినా వాల్టా చట్టం ప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మారెడ్డి హెచ్చరించారు.

బావిలో దూకి యువకుడి బలవన్మరణం

● పెళ్లికావడం లేదని మనస్తాపంతో..

నంగునూరు, ఫిబ్రవరి 7: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నంగునూరు మండలంలోని కోనాయిపల్లికి గ్రామానికి చెందిన రజినీకర్‌రెడ్డి(38) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం రజినీకర్‌రెడ్డి కోనాయిపల్లి గ్రామ శివారులోని నిమ్మ బాల్‌రెడ్డి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం బావిలో మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నారు. కాగా విచారణ అనంతరం అదే గ్రామానికి చెందిన రజనీకర్‌రెడ్డి మృతదేహంగా గుర్తించారు. కాగా మృతదేహాన్ని బావిలోంచి తీసేందుకు గ్రామస్థులెవరూ ముందుకు రాకపోవడంతో ఎస్ఐ స్వయంగా బావిలోకి దిగి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి చరణ్‌తేజ్‌గౌడ్



వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థితో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి చరణ్‌తేజ్‌గౌడ్ రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. బీహార్‌లో జరిగే జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చరణ్‌తేజ్ గౌడ్ పాల్గొననున్నాడు. వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యాసంస్థల డైరెక్టర్ సలోమోన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

దొంగతనాలకు చెక్

ఫలిస్తున్న కొమురవెల్లి పోలీసుల వ్యూహం

- గంగిరేగుచెట్టు ప్రాంగణంలో నిలిచిన అపహరణలు
- 20మంది పోలీసులు, సిబ్బందితో బందోబస్తు
- పటిష్ఠ నిఘాతో చోరీలు తగ్గుముఖం

చేర్యాల, ఫిబ్రవరి 7: జనసమ్మర్థం అధికంగా ఉండే కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం, గంగిరేగు చెట్టు ప్రాంగణంలో దొంగతనాలు చోటుచేసుకోకుండా కొమురవెల్లి పోలీసులు తీసుకున్న ప్రత్యేక చర్యలు ఫలిస్తున్నాయి. తద్వారా ప్రశాంతంగా మొక్కులు తీర్చుకుంటున్న పరిస్థితి నెలకొనడంతో భక్తులు దొంగల బెడద నుంచి ఊరట చెందుతున్నారు. ఆలయానికి దూరంగా వాహనాలను నిలిపివేయిస్తున్న విషయంలో పలువురి నుంచి భిన్న ఆరోపణలు ఎదుర్కుంటున్నప్పటికీ దొంగతనాల నివారణకు తీసుకున్న బందోబస్తు చర్యలను కొనియాడుతున్నారు. మల్లన్న ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రతీ ఆది, బుధవారాలలో వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. తమ కోరికలు ఈడేర్చినందుకు ప్రతిగా భక్తులు అధికసంఖ్యలో గంగిరేగుచెట్టు ప్రాంగణంలో నజరు పట్నాలు రచించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇంటిల్లిపాది తరలివస్తుండటంతో జనసమ్మర్థం అధికంగా ఉంటుంది. పట్నాలువేసే వారితో పాటు మహిమాన్వితమైన గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టి గండదీపానికి దండం పెట్టి ప్రదక్షిణలు చేస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు గుంపులో చేరి దోచుకుంటున్నారు. పలువురు మాయలేడీలు మహిళల మెడలలో నుంచి బంగారు గొలుసులు, పర్సులు కొట్టేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో గతనెల 7వ తేదీన జరిగిన మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం రోజున తోట బావి ప్రాంగణంతో పాటు గంగిరేగు చెట్టు ఆవరణలో పలువురి మహిళలు బంగారు గొలుసులు కొట్టేసి ఉనికి చాటుకోవడంతో భక్తుల్లో అలజడి మొదలైంది.



గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పర్యవేక్షిస్తున్న పోలీసులు



రాజగోపుర ఆవరణలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను ఆశ్రయిస్తున్న భక్తులు

పోలీసుల అప్రమత్తం.. పటిష్ఠ నిఘా

జాతర ప్రారంభంలోనే పలువురి బంగారు ఆభరణాలు అపహరణకు గురవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. భక్తుల సొమ్ము భద్రత కోసం ప్రత్యేకచర్యలు చేపట్టారు. గంగిరేగుచెట్టు ప్రాంగణం చుట్టూ పటిష్ఠ నిఘా కోసం సుమారు 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలు రెండు షిఫ్టులలో పర్యవేక్షించడంతో పాటు సుమారు 20 మంది మహిళలు, పోలీస్ కానిస్టేబుళ్ల గస్తీ ఏర్పాటు చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి ఆరాతీస్తున్నారు. అంతేకాకుండా ఆలయం లోపలికి వెళ్లే ప్రధాన మార్గమైన రాజగోపుర ఆవరణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడ పలువురు సిబ్బంది అందుబాటులో ఉండి ఆయా పరిసరాలలో పోలీసుల నిఘా ఉన్నదని తెలిపేలా చేసిన ప్రయత్నం సత్ఫలితాన్నిస్తున్నది.

భక్తులకు భరోసా కల్పించేందుకు కృషి

మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులకు భద్రత కల్పించి భరోసా పెంపొందింపచేసేందుకు కృషి చేస్తున్నాం. రద్దీ అధికంగా ఉండే గంగిరేగుచెట్టు ప్రాంగణంలో పటిష్ఠ నిఘాతో పర్యవేక్షిస్తున్నాం. దీంతో మూడువారాల జాతరలో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

- నాగరాజు, కొమురవెల్లి ఎస్‌ఐ



రాష్ట్రంలో ఎన్నికలు జరిగి, ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి బాధ్యతల చేపట్టి నేటికీ సరిగ్గా రెండు నెలలు గడిచింది. అయినా ఆ విద్యాసంస్థకు మాత్రం ముఖ్యమంత్రిగా మాజీ అయిన కేసీఆర్ ఉన్నట్టున్నది. అందుకే కాబోలు పటాన్‌చెరులో తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూలు, జూనియర్ కళాశాల బోర్డుపై ముఖ్యమంత్రిగా కేసీఆర్ బొమ్మ ఉండడం విమర్శలకు తావిస్తున్నది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి



యాదయ్య(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 7: చెరువులో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు నీట మునిగి మృతిచెందారు. ఈ సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం పక్కిబండ గ్రామానికి చెందిన యాసిన్‌ఖాన్(60), బర్రి యాదయ్య(58) కలిసి గ్రామ కుడి చెరువులో చేపల పట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి చనిపోయారు. చేపల వేటకు వెళ్లిన వారు ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన ఇరు కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. అనంతరం చెరువు కట్టపైన చెప్పులు, బట్టలు కనిపించడంతో రాత్రి 10 గంటలకు చెరువులో వెతకగా ఇద్దరి మృతదేహాలు లభించాయి. కాగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు యాసిన్ కుమారుడు మహ్మద్ గౌస్ ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో...



లక్ష్మణ్ మృతదేహం

చేగుంట, ఫిబ్రవరి 7: చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ హరీశ్‌గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండల పరిధిలోని పొలంపల్లి గ్రామానికి చెందిన యాట లక్ష్మణ్(23) మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని తుర్క చెరువులో చేపల వేటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఈ క్రమంలో చుట్టుపక్కల పొలాల రైతులకు చెరువు గట్టున ద్విచక్ర వాహనం, చెప్పులు, బట్టలు కనిపించడంతో కుటుంబసభ్యులకు సమాచారమందించారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో లక్ష్మణ్ మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హత్నూర, ఫిబ్రవరి 7: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బోర్పట్ల గ్రామ శివారులో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీరాములు(63) తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటారు స్టార్టర్ డబ్బా వద్ద స్విచ్ ఆన్‌చేస్తున్న క్రమంలో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీప పొలంలో ఉన్న రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి శ్రీరాములు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

పారదర్శకంగా ఈవీఎంల తనిఖీ: మెదక్ కలెక్టర్



స్ట్రాంగ్‌రూం గది సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి తనిఖీలను పారదర్శకంగా ఇంజనీర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం స్థానిక గోడన్‌లో ఎఫ్ఎల్‌సీ, వెబ్‌కాస్టింగ్, ఈవీఎంల నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు(బియూ) కంట్రోలింగ్ యూనిట్(సీయూ) వీవీ ప్యాట్ల యంత్రాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

లాభాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపోకు జోన్‌లో ఐదోస్థానం

● టీఎస్‌ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్



గజ్వేల్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తంనాయక్

గజ్వేల్, ఫిబ్రవరి 7: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో హైదరాబాద్ జోన్ పరిధిలో ఐదోస్థానంలో నిలిచిందని హైదరాబాద్ జోన్ టీఎస్‌ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్ తెలిపారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పరిధిలో నిర్మిస్తున్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్, గజ్వేల్ బస్‌బే, ప్రారంభమైన గజ్వేల్ బస్టాండ్లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అనంతరం డిపోలో సూపర్‌వైజర్స్, సిబ్బంది పనితీరును పరిశీలించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్ డిపో నవంబరు 2023 వరకు రూ.90 లక్షల లాభాల్లో ఉన్నదని, హైదరాబాద్ జోన్‌లో ఐదోస్థానంలో నిలిచినందుకు సిబ్బంది, అధికారుల శ్రమను అభినందించారు. డిపోలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు పెంచేందుకు తగిన సూచనలు చేశారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ, ఎస్‌టీఐ కనకలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్యారం పోటీలకు ఎంపీవో సతీష్ ఎంపిక



నూతికట్టు సతీష్

మనోహరాబాద్, ఫిబ్రవరి 7: ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్యారం పోటీలకు మనోహరాబాద్ ఎంపీవో నూతికట్టు సతీష్ ఎంపికయ్యారు. ఈ పోటీలు 10 నుంచి 15 తేదీ వరకు బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో జరగనున్నాయి. ఈ సందర్భంగా సతీష్‌కు పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

టీవీవీపీలో 317 జీవో కింద 60 మంది స్టాఫ్‌నర్సుల బదిలీ

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7: సంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న 60 మంది స్టాఫ్ నర్సులు 317 జీవో అమలుతో సొంత జోన్లకు బదిలీ అయ్యారు. జోన్-5కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఒకరు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి ఒకరు బదిలీ అయ్యారు. 3 జోన్‌కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ముగ్గురు, జహీరాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి ఇద్దరు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి 30 మంది, నారాయణఖేడ్ ఏరియా ఆస్పతి నుంచి ఇద్దరు, జోగిపేట ఏరియా ఆస్పత్రి నుంచి ఇద్దరు, సదాశివపేట సీహెచ్‌సీ నుంచి ఒకరు బదిలీఅయ్యారు. 7 జోన్‌కు పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రి నుంచి ఆరుగురు, సంగారెడ్డి జీజీహెచ్ నుంచి 12 మంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన స్థానాల్లో కొత్తవారు నియమితులయ్యే వరకు తిరిగి పాత స్థానంలోనే పనిచేయాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. రెండేళ్ల కిందటే అన్ని ప్రభుత్వ శాఖల్లో జీవో 317 అమలులో భాగంగా ఉద్యోగులు సొంత జోన్లకు బదిలీ అయినా వివిధకారణాల నేపథ్యంలో టీవీవీపీ కింద పనిచేసే వారికి స్థానచలనం కలగలేదు. ఎట్టకేలకు 317 జీవో అమలుతో టీవీవీపీ కింద పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులకు తొలుత స్థానచలనం కలుగగా, మున్ముందు మిగతా ఉద్యోగులు, వైద్య సిబ్బంది సొంత జోన్లకు బదిలీ అయ్యే అవకాశం ఉన్నదని టీవీవీపీ అధికారవర్గాలు తెలిపాయి.

గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

- 'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



హుస్నాబాద్ మండలం నాగారంలో పారిశుధ్యంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు మహిళలు కంకణబద్ధులు కావాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం నాగారం, మహ్మదాపూర్ గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లోని మురుగు కాలువలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించారు. గ్రామాల్లో ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్స్ దర్శనం ఇవ్వకుండా వాటి వాడకాన్ని సమూలంగా తగ్గించాలన్నారు. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు, జాతరకు వెళ్తున్న సమయాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా స్టీల్ బ్యాంకు ద్వారా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు తీసుకుని ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై గర్భిణులకు, బాలింతలకు అవగాహన పెంపొందించాలన్నారు. గ్రామాల్లోని నర్సరీల పెంపకంలో అశ్రద్ధ చేయొద్దని పేర్కొన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పాలనాధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. వాటర్ ట్యాంకులను పరిశుభ్రం చేయాలని వాటర్‌మెన్‌లను ఆదేశించారు. డంపింగ్‌యార్డుల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులు తయారు చేసి పంట పొలాలకు వాడుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌షెడ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో బాలిక ఆరోగ్యం పట్ల పరీక్షలు చేపట్టాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు.

విద్యార్థులకు పాఠాలు బోధించిన అదనపు కలెక్టర్

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహ్మదాపూర్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఎంతమంది 10 జీపీఏ సాధిస్తారనే నమ్మకం ఉందో చేతులు ఎత్తి చూపాలన్నారు. నిత్యం పాఠశాలకు హాజరుకావాలని, శ్రద్ధతో చదివి లక్ష్యం చేరుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించి పంచాయతీ నిధుల నిల్వలు, ఉపాధి పనులపై కార్యదర్శులను ఆరాతీశారు. ఆమె వెంట ఎంపీపీ లకావత్ మానస, జిల్లా పంచాయతీ అధికారి బి.దేవకి, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజన, ఎంపీడీవో రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ సత్యనారాయణ,ఏపీఎం శ్రీనివాస్, ఎంపీటీసీ పిట్టల శ్రావణి, తాజా, మాజీ సర్పంచులు బత్తుల సుగుణ, సంపత్, కార్యదర్శులు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: సంగారెడ్డి ఎస్పీ



వాహనదారులకు గులాబి పువ్వు ఇచ్చి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 7: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ కోరారు. మునిపల్లి మండలం కంకోల్ సమీపంలోని ఎల్‌అండ్‌టి డెక్కన్ టోల్ ప్లాజా వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే మరణాల సంఖ్య తగ్గించవచ్చని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనదారులకు గులాబీ ఇచ్చి రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్, మునిపల్లి ఎస్‌ఐ సురేష్, ఎల్‌అండ్‌టి రాజేష్‌విచారి, సంతోష్ డోగ్రే, విజేందర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున ముగ్గురిపై కేసు

- 15 గ్రాముల 4 గంజాయి ప్యాకెట్లు, రెండు మొబైల్స్, స్కూటీ స్వాధీనం



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు, ఫిబ్రవరి 7: దూళిమిట్ట మండల కేంద్రంలోని జగ్గన్నకుంట వద్ద గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ముగ్గురు యువకులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి మద్దూరు పోలీసులు పట్టుకున్నట్లు చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపారు. బుధవారం మద్దూరులోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్‌అలీతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన చిలుక ఉదయ్‌కుమార్, బోయిని భాను, బాబు(మైనర్) జల్సాలకు అలవాటు పడ్డారు. ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో హైదరాబాద్ నుంచి గంజాయి తెస్తూ విక్రయిస్తున్నారు. కాగా బుధవారం దూళిమిట్ట మండల కేంద్రంలోని జగ్గన్నకుంట వద్ద గంజాయి సేవిస్తూ.. విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. నమ్మదగ్గ సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. వారి నుంచి 15 గ్రాముల 4 గంజాయి ప్యాకెట్లు, సిగరెట్ పేపరు, బాటిల్ ద్వారా పీల్చే పైపు, రెండు మొబైల్స్, స్కూటీని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కుమార్‌పై 2022లో గంజాయి కేసు నమోదైందని తెలిపారు. భాను కూలీ పనులు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు మద్దూరు ఎస్‌ఐని చేర్యాల సీఐ అభినందించారు. రివార్డు కోసం పోలీస్ కమిషనర్‌కు సిఫార్స్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌కు యత్నం

● ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7: సిద్దిపేట పట్టణంలో బాలుడిని కిడ్నాప్‌కు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాలుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిప్రియనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న వంశీధర్‌రెడ్డి కుమారుడు(10) ఈ నెల 2న సాయంత్రం 6 గంటలకు అపార్ట్‌మెంట్ దగ్గరలో ఉన్న హెయిర్ కటింగ్ షాపుకు వెళ్లి కటింగ్ చేసుకుని వస్తున్నాడు. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చి బాలుడితో మాట్లాడి బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు వెళ్దాం.. బండి ఎక్కు అని అడిగాడు. దీంతో బాలుడు భయపడి ఇంటికి పరిగెత్తి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి చూడగా సదరు వ్యక్తి అప్పటికే ఉడాయించాడు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించగా వచ్చిన వ్యక్తి సరిగ్గా కనిపించలేదు. దీంతో బాలుడి తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన సిద్దిపేటలో కలకలం సృష్టించింది.

పట్టపగలు చికెన్ సెంటర్‌లో చోరీ

● సుమారు రూ.3 లక్షలు మాయం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7: సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద ఉన్న సుధాకర్‌రెడ్డి చికెన్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు వెళ్లి కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.3 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన కొద్దిసేపటి తర్వాత యజమాని కౌంటర్‌లో ఉన్న డబ్బులు తీయడానికి చూస్తే కనిపించలేదు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారమందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికెన్ సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య గ్రామాలు ఆరోగ్యానికి నిలయాలు

- ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి
- నాటిన మొక్కలను కాపాడుకోవాలి
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- నందికందిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

సదాశివపేట, ఫిబ్రవరి 7: పారిశుధ్య గ్రామాలు ఆరోగ్య నిలయాలుగా నిలుస్తాయని, గ్రామాలు పచ్చదనంతో పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 15వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం సదాశివపేట మండలం నందికంది గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ ఇంటికి నీటి సరఫరా జరగాలని, నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పైప్‌లైన్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. గ్రామంలో నాటిన చెట్లను సంరక్షించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర, కాగితం సంచులను వాడాలన్నారు. నందికంది గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు భవనాలను, స్థలాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సామ్ మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పౌష్టికాహారం అందించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఎల్వో సతీష్‌రెడ్డి, ఎంపీడీవో పూజ, తహసీల్దార్ కె.సరస్వతీ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో

మెదక్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో వారం రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ బుధవారం మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒకరి చొప్పున పత్యేక అధికారులను నియమించారు.

పారిశుధ్యంపై అవగాహన

సంగారెడ్డి టౌన్: మునిపల్లి మండలం బుదేరాలో ఏర్పాటు చేసిన పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన సదస్సులో జడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొని, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినందన్‌రావు, తాజా మాజీ సర్పంచ్ గౌరమ్మ, ఫసీయొద్దీన్ పాల్గొన్నారు.

● **వట్‌పల్లి/మనూరు:** నాగులపల్లిలో గ్రామసభకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు శాంబిరెడ్డి, మహేష్ చౌహాన్, అశోక్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్‌రావు పాల్గొన్నారు. మనూరు మండలం ధన్వార్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో షాజీలుద్దీన్, ఏపీవో షాహేద్ పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రత్యేకాధికారులు మోహనమురళీ, వసంతకుమారి, ఎంపీడీవో సుమతి, తహసీల్దార్ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **నిజాంపేట:** మండల కేంద్రంలో ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్ల వెంబడి చెత్తను తొలగించారు.

● **పెద్దశంకరంపేట:** మండల పరిధిలోని గొట్టిముక్కుల గ్రామసభలో డీఎఫ్‌వో, మండల ప్రత్యేక అధికారి రవిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్, ఎంపీటీసీ దత్తు పాల్గొన్నారు.

● **నాగల్‌గిద్ద:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని మండల పరిధిలోని గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

● **నారాయణఖేడ్:** మండల కేంద్రమైన నిజాంపేటతో పాటు వెంకటాపూర్, నర్సాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నిజాంపేటలో ప్రత్యేకాధికారి రాజు గణేష్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజీబాయి రాంచందర్ పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండల పరిధిలోని నెల్లూరులో నిర్వహించిన గ్రామసభలో ఎంపీపీ స్వరూప పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నందికంది గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్

● **అల్లాదుర్గం:** మండలంలోని రాంపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌యాదవ్ పాల్గొని పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తుక్కారాం, నాయకులు శేషారెడ్డి, బలరాంరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండలంలోని జంగరాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మిగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పీఆర్ఏఈ విజయ్‌కుమార్, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి భాను పాల్గొన్నారు.

● **చేగుంట:** నార్సింగి మండలంలోని జప్తి శివనూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సుజాత, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

● **మాసాయిపేట:** మండలంలోని మాసాయిపేట, అచ్చంపేట, పోచంపల్లి, బొమ్మారం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

● **కల్హేర్/సిర్గాపూర్:** కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కల్హేర్ మండల ప్రత్యేకాధికారి నర్సింహారావు, కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, కల్హేర్, సిర్గాపూర్ తహసీల్దార్లు బాలశంకర్, ఉమాశంకర్, ఎంపీడీవోలు శ్రీనివాస్, సుజాత, నాయకులు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** యావాపూర్‌గ్రామసభకు జడ్పీ సీఈవో వెంకట శైలేష్‌కుమార్ హాజరవగా.. ఎంపీటీసీ గంగుమల్ల సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి పాల్గొన్నారు.



తూప్రాన్: యావాపూర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శైలేష్‌కుమార్



మొగుడంపల్లి మండలం గోవిందాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.10కోట్లు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: ఖేడ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం నాలుగు ఎకరాల స్థలాన్ని కూడా గుర్తించినట్లు వెల్లడించారు. నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా గ్రాంట్స్ కింద రూ.15.06 కోట్ల మంజూరుకు కలెక్టర్ ప్రొసిడింగ్స్ ఇచ్చారని వెల్లడించారు. కాగా నారాయణఖేడ్ ప్రాంతవాసులకు ఉపాధి కల్పించేందుకు 50 నుంచి 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండి, రోడ్డు సదుపాయం ఉంటే పరిశ్రమల క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును హామీ ఇచ్చారని తెలిపారు. ఖేడ్ చుట్టు పక్కల భూమిని గుర్తించాలని అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల మరమ్మతులకు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కాగా సీఎంపై బాల్క సుమన్ వాఖ్యలను ఎమ్మెల్యే ఖండించారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు బోజిరెడ్డి, రమేష్‌చౌహాన్, పండరిరెడ్డి, రాజు, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ



ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తున్న నాయకులు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి, 7: ఉపాధిహామీ పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం విమర్శించారు. బుధవారం మండలంలోని స్కూల్ తండాలో కేంద్రం ప్రజా వ్యతిరేక విధాలనాలను అనుసరిస్తున్నదని ప్రజలకు వివరించారు. ఉపాధి హామీ పథకానికి ఏటా నిధులను తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. పేద ప్రజలను పట్టించుకోని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే తమ ధ్యేయమని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 16న నిర్వహించనున్న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, గోపాల్, మాలి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

అల్లాదుర్గం/రామాయంపేట/నిజాంపేట, ఫిబ్రవరి 7: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం అల్లాదుర్గంలో రోడ్డు భద్రత నియమాలపై అల్లాదుర్గం సీఐ రేణుక, నిజాంపేట, రామాయంపేటలో రామాయంపేట సీఐ వెంకటేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని స్పష్టం చేశారు. అతి వేగం, వాహన సామర్థ్యాన్ని మించి ఆట్లో ప్రయాణికులను ఎక్కించడం, మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు సంభవించే అవకాశముందన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు నిబంధనలు విధిగా పాటించాలని సూచించారు. అల్లాదుర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్ఐ దేవిదాస్ రాథోడ్, నిజాంపేటలో ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సునీత, వేణుగోపాల్, సాయిబాబా, రజాక్, లక్ష్మణ్, వినోద్, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి, ఉపసర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'మా సమస్యలను పరిష్కరించండి'

పాపన్నపేట, ఫిబ్రవరి 7: గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల నాయకుడు అశోక్ కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్మికులతో కలిసి బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు, సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం హయాంలో 34 రోజుల సమ్మె చేసినా పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, వేతనాలు పెంచాలని కోరారు. ఈ నెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగానికి నిధులపై ప్రస్తావించండి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించేలా ప్రస్తావించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం చింతా ప్రభాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అరకొర నిధులు కేటాయించడంతో విద్యార్థులకు సమయానికి స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో రవితేజ ఉన్నారు.

దాతర్‌పల్లిలో వివాహిత అదృశ్యం



శ్వేత

తూప్రాన్, ఫిబ్రవరి 7: భర్తతో విడాకులై తల్లి వద్ద ఉంటున్న మహిళ అదృశ్యమైంది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్‌పల్లి గ్రామానికి చెందిన శ్వేత(26)కు మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు చెందిన వ్యక్తితో గతంలో వివాహమైంది. శ్వేత మతిస్థిమితంతో పాటు ఫిట్స్‌తో బాధపడుతుండడంతో భర్త విడాకులు తీసుకున్నాడు. కొన్నేళ్లుగా దాతర్‌పల్లిలో తల్లి భాగ్యమ్మ వద్దనే ఉంటుంది. ఈ నెల 4న భాగ్యమ్మ పనిమీద వట్టూరుకు వెళ్లి రాగా ఇంటి వద్ద ఉన్న శ్వేత కనిపించకుండా పోయింది. వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం తూప్రాన్ పోలీసులకు తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

అన్నారంలో వ్యక్తి..



వెంకటేష్

గుమ్మడిదల, ఫిబ్రవరి 7: గుమ్మడిదల మండలం అన్నారం గ్రామానికి చెందిన పట్నం వెంకటేష్, వర్షిక దంపతులు. ఈ నెల 4న వారిద్దరూ అన్నారం మార్కెట్‌లో కూరగాయలు అమ్ముతుండగా ఇప్పుడే బయటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వెంకటేష్ తిరిగిరాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం వర్షిక చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ఆటోలను దొంగలించిన నిందితుడి అరెస్టు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 7: కొంత కాలంగా ఆటోల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని మెదక్ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పట్టణ సీఐ దిలీప్‌కుమార్ వివరాలు వెల్లడించారు. హవేళీఘణపూర్ మండల పరిధిలోని మద్దుల్వాయి గ్రామానికి చెందిన నవీన్ మెదక్‌లో 3, గుమ్మడిదల స్టేషన్ పరిధిలో ఒక ఆటోను దొంగలించాడు. బుధవారం ఉదయం మెదక్‌లని వెల్కమ్ బోర్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటో నడుపుతూ వచ్చిన నవీన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో గతంలో చేసిన దొంగతనాల గురించి ఒప్పుకున్నాడు. నవీన్‌ను అరెస్టు చేసి, మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని, రిమాండుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వెల్దుర్తి మండల పాఠశాల ప్రత్యేక అధికారి రాకేష్ అన్నారు. బుధవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు తమ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి మార్కుల గురించి కాకుండా తమ జీవిత లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

చిన్నశంకరంపేట: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని ఎంఈవో బుచ్చయ్య అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట కేజీబీవీని ఆయన సందర్శించి, విద్యార్థులకు పలు సూచనలు తెలిపారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో విజయాలు సాధిస్తారని వివరించారు. ఆయనవెంట స్పెషల్ ఆఫీసర్ గీత, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

డీటీసీ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

సంగారెడ్డి క్రైం: చిద్రుప్పలోని డీటీసీ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ బుధవారం సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి చేపట్టిన పోలీసు రిక్రూట్‌మెంట్‌లో భాగంగా పోలీసు కానిస్టేబుళ్లుగా వారికి 9 నెలల బేసిక్ శిక్షణ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో డీటీసీ ప్రిన్సిపాల్ రాములునాయక్‌తో సమావేశం నిర్వహించారు. శిక్షణకు అవసరమైన ఏర్పాట్ల గురించి ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ రమేష్ కుమార్, సీఐలు శ్రీధర్‌రెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని డీఈఐసీ కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డీఈఐసీ కేంద్రంలోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సిబ్బంది రక్తదానం చేశారు.

సేవాలాల్ టోర్నమెంట్ ప్రారంభం

నారాయణఖేడ్: సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఖేడ్ తహసీల్ మైదానంలో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు బోజిరెడ్డి, సుధాకర్ రెడ్డి, కిషన్‌నాయక్‌రాథోడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మాసాయిపేట: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నియంత్రణపై పోతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చేగుంట ఎస్ఐ హరీష్ గౌడ్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవిందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు బోనాలు

మెదక్ అర్బన్: మాఘ అమవాస్యను పురస్కరించుకొని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, గట్టమ్మ, బోరంచమ్మ అమ్మవార్లకు ఘనంగా బోనాలు తీశారు. పట్టణంలోని పిట్లంబేస్, సుభాష్‌కాలనీ, దాయర, ఫతేనగర్‌లో బోనాల ఊరేగింపు నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు

సదాశివపేట/శివ్వంపేట: సదాశివపేట సీఐగా బాలస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సీఐగా పనిచేసిన నవీన్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శివ్వంపేట ఎస్ఐగా మహిపాల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు పనిచేసిన రవికాంత్‌రావు మెదక్‌టౌన్‌కు బదిలీ అయ్యారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: పెద్దశంకరంపేట మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ సూచించారు. బుధవారం మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ ఏప్రిల్ 7న పరీక్ష నిర్వహించి, మే 25న తుది జాబితా వెల్లడిస్తామన్నారు. ఏడవ నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విధుల్లో చేరిన నిజాంపేట కార్యదర్శి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: 'కార్యదర్శిలేక.. ప్రతేకాధికారి రాక' శీర్షికన ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. దీంతో నిజాంపేట పంచాయతీ కార్యదర్శిగా నియామకమైన జనార్ధన్‌రెడ్డి బుధవారం విధుల్లో చేరారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ రాజాగణేష్ గ్రామసభను కూడా నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

వ్యాపారాల్లో మహిళలు ముందంజ

తూప్రాన్, ఫిబ్రవరి 7: మహిళల ఆర్థికాభివృద్ధికి వ్యాపారాలు నిర్వహించుకునేందుకు సహకారం అందించడంలో మెదక్ జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నదని జిల్లా అదనపు డీఆర్‌డీవో భీమయ్య పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్‌లో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల సమైక్య సిబ్బంది, సీసీలు, వీవోఏ(సీఏ)ల అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేయడంలో రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలు మొండి బకాయిలు లేకుండా సంఘాల సమావేశాలు సక్రమంగా జరపాలన్నారు. సమావేశంలో బ్యాంకు లింకేజీ ఏపీఎన్ వెంకటేశ్వర్లు, ఏపీఎన్ ఐబీ వెంకటస్వామి, జిల్లా శ్రీనిధి మహిళా బ్యాంకు రీజనల్ మేనేజర్ గంగారం, ఏపీఎం పెంటాగౌడ్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

భూ సేకరణపై ఆర్డీవో అవగాహన

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: నారాయణఖేడ్ మండలం జూక్కల్ శివారులోని కిషన్‌నాయక్‌తండావాసులతో బుధవారం ఆర్డీవో సమావేశం నిర్వహించారు. నారాయణఖేడ్-నిజాంపేట్-బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణం కోసం అవసరమయ్యే భూ సేకరణ గురించి అవగాహన కల్పించారు. భూమిని కోల్పోతున్న వారికి అవార్డు ఎంక్వైరి గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవదాస్, ఆర్ఐ.శ్యాంరావు, పంచాయతీ కార్యదర్శులు రాజు, సుధాకులకర్ణి, సుమలత, మండల సర్వేయర్ సునీత, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో గావ్ చలో అభియాన్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7: గావ్ చలో అభియాన్‌లో భాగంగా పెద్దశంకరంపేటలో బుధవారం ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ వివరించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● గుమ్మడిదల: గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో బీజేపీ నాయకులు గావ్ చలో అభియాన్‌ను నిర్వహించారు. ప్రజలను కలసి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లవల్లి గ్రామ ప్రవాసీ చెన్నంశెట్టి ఉదయకుమార్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి రామ్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, మనోజ్, ముత్యాలుగౌడ్, గ్రామ నాయకులు శేఖర్, మన్నే దేవేందర్, ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి

● వెల్దుర్తి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి, ఫిబ్రవరి 7: వేసవి కాలం వస్తున్నందున గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎంపీపీ స్వరూప సూచించారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మదిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్ రిజస్టర్లను, మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికార సరఫరాను పరిశీలించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవికి సూచించారు. వెల్దుర్తి మండలానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ సభ దృష్టికి తెచ్చారు. వెల్దుర్తికి ఎన్ని బస్సులు నడుస్తున్నాయని, ఏ సమయానికి వస్తున్నాయని లిఖిత పూర్వకంగా రాసివ్వాలని నర్సాపూర్ ఆర్టీసీ ఏడీసీ మధుసూదన్‌రెడ్డికి ఎంపీపీ సూచించారు. హల్దీ వాగుపై నాలుగు చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, ఎడమ, కుడి కాలువ మరమ్మతుల కోసం ప్రతిపాదనను స్నతాధికారులకు సమరిస్తామని ఇరిగేషన్ డీఈ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలు వినిపించారు. సమావేశంలో అటవీశాఖ సెక్షన్ అధికారి రవికుమార్, విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, ఎంపీవో విఠ్ఠేశ్వర్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వరూప

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

● జహీరాబాద్ ఎంపీపీ ప్రియాంకాగుండారెడ్డి

జహీరాబాద్, ఫిబ్రవరి 7: సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ ప్రియాంకాగుండారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చొరవచూపాలని సూచించారు. ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. మండలస్థాయి అధికారులు సైతం గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని కోరారు. అధికారులు కూడా ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని ఆదేశించారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి మోహన మురళీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో మహేష్ మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు పొందిన రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బోర్లను వేయించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రియాంక

రమాబాయి జయంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతి సందర్భంగా బుధవారం సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఆమె చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కర్యదర్శి బీరయ్యయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు రమాబాయి చేసిన త్యాగాలు మరువలేనివని కొనియాడారు. అదే విధంగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు నాగయ్య, ప్రవీణ్, మల్లేశ్‌యాదవ్, మొహన్ రాజు, బస్వరాజ్, పురుషోత్తం, అఖిల్, అంజద్, రాములు, కేవపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానిక్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, నాయకులు యదగిరి, బాబురావు, రమేష్‌గౌడ్, ప్రవీణ్, వాణి, రవి, కిరణ్‌గౌడ్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖేడ్‌లో మాతా రమాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ భవన్‌లో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖేడ్ ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నర్సింహులు, బీంసేన, రాజు, సంజీవ్, కాన్షీరాం, అనుముల తుకారం, వినోద్, కృష్ణ, ఉమాసింగ్, లింగం, మోహన్, నగేష్, రఘు, నారాయణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● **నిజాంపేట:** మండల కేంద్రంలో తాజా మాజీ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొమ్మాట బాబు ఆధ్వర్యంలో రమాబాయి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, మహేష్, ఎల్లం, రమేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహంలో రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాల్క సుమన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ డిమాండ్

నర్సాపూర్, ఫిబ్రవరి 7: సీఎం రేవంతర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రాష్ట్ర మహిళ నాయకురాలు సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నర్సాపూర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, మల్లేశం, సుదీర్‌రెడ్డి, సురేష్‌నాయక్, రిజ్వాన్, అజ్మత్, రషీద్, రవిబాబు పాల్గొన్నారు.

● **మనోహరాబాద్:** కాళ్లకల్ గ్రామంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, శ్రీనివాస్, సత్యనారాయణ, నర్సింహ్మాచారి, సర్వేన్‌గౌడ్, సాయికుమార్, మల్లేష్, నాగారాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● **పాపన్నపేట:** మెదక్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు నరేందర్‌గౌడ్, సాయిలు, అబేద్, శ్రీధర్, కలీం, తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గిరిజన గురుకులాల తనిఖీ

నర్సాపూర్/హత్నూర, ఫిబ్రవరి 7: నర్సాపూర్ గిరిజన గురుకులాన్ని, హత్నూర సాంఘిక సంక్షేమ గురుకులాన్ని బుధవారం విజిలెన్సు అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంటు డీజీ ఆదేశాల మేరకు రామచంద్రాపురం ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేశారు. హాస్టల్‌లో ఆహార నాణ్యత, స్టోర్‌రూం రికార్డులు, వంటగది, మరుగుదొడ్లు, తరగతిగదులను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను క్షుణంగా పరిశీలించారు. తనిఖీ చేసిన వారిలో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు మహేష్, ప్రశాంత్, కోటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

'ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి'

నర్సాపూర్, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటేనే రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోగలుగుతామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లో నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అన్ని గురుకులాలను ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తేవాలని, మోడల్‌స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి రవి, నాయకులు విశాలక్ష్మి, అస్రాషాహిన్, నాగుల్‌మీరా, శివశంకర్, గంగాధర్, రాజు, శ్రీరాముర్తి, జయమ్మ, చంద్రమణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

బైకులు అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

రామాయంపేట, ఫిబ్రవరి 7: వేర్వేరు ప్రాంతాల్లో బైకులు అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. రామాయంపేట-కామారెడ్డి బైపాస్ వద్ద బుధవారం బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడికి గాయాలయ్యాయి. గంటల పాటు నడి రోడ్డుపై బైక్ పడి ఉండడంతో దాని మీదుగాను పలు వాహనాలు వెళ్లడంతో ధ్వంసం అయ్యింది. అలాగే దామరచెరువు మీదుగా కంచర్లకు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పడంతో చెట్టుకు ఢీకొని లింగం అనే వ్యక్తికి గాయాలయ్యాయి.